# కష్టమ్స్ అండ్ సిస్టమ్స్

● రాజా ●

## రెండు రోజుల తర్వాత మళ్ళీ రమణే వచ్చాడు మా ఇంటికి.

"ఏరా ఎక్కడా అయిపులేవు?" అంటూ.

నీరసంగా నవ్వాను.

"నాకు తెలుసుగాని పద..." అన్నాడు చెయ్యి పట్టుకుని లేవదీస్తూ.

"ఎక్కడికి?"

"చెప్తా దా!..." అంటూ నన్ను వాడి కారులో ఆల్మోస్ట్ కూలపడేసినంత పనిచేశాడు.

ఓ అరగంటలో వాడి ఫ్లాట్‌లో ఉన్నాం. వాడి పర్సనల్ రూం నిజంగా చాలా ప్రైవేట్‌గా ఉంది.

"నేను ఊహించగలన్నా... నీలో చెలరేగుతున్న సంఘర్షణ ఏమిటో?" అన్నాడు.

నేను మౌనంగా ఉండిపోయాను. ఫైన్‌రియంబర్స్‌మెంట్ స్కీమ్ పెట్టి డబ్బు గడించిన వాడి తెలివితేటల్ని నేను హరాయించుకోలేక పోయానని ఎలా చెప్పగలను?

(ఫైన్ రియాంబర్స్ స్కీమ్‌లో రమణ డబ్బు గడించిన వివరాలను 28.5.93 సంచికలో చూడండి)

"అయినా ఎ ఫ్రెండ్ ఈజ్ ఎ ఫ్రెండ్ కదా?" అన్నాడు.

కరక్టేననిపించింది. చదువుకుంటున్న రోజుల్లో, కలిసి తిరుగుతున్న రోజుల్లో ఎవరెవరు ఎక్కడెక్కడ ఎలా స్థిరపడతామో ఊహించలేం కదా! పొజిషన్ బట్టి మారేది నిజమైన స్నేహం కాదు కదా!?"

"అవును" అన్నాను.

"అంచేత కొన్ని కొన్ని మనసులోంచి తుడిచేసుకొని నేనో సంఘటన చెప్తా విను. నేనీ ఊర్నించి వెళ్ళి నా బిజినెస్ కోసం తగిన ప్లేస్ వెతుకుతున్న రోజులవి.

అప్పుడు పరిచయం అయ్యాడు కామేశ్వరరావు.. కామేశ్వరరావు అంటే జవహర్‌లాల్ నెహ్రూనా, రాజీవ్‌గాంధీనా చెప్పగానే తెలియటానికి అని అనుకోకు. కామేశ్వరరావు మన ఇండియా నుంచి వెళ్ళి లండన్‌లో స్థిరపడ్డ ప్రవాసాంధ్రుడు.

బిజినెస్‌లో అద్భుతంగా ముంచేసే తెలివితేటలతనివి.

నా బిజినెస్‌కి కావలసిన పెట్టుబడి డబ్బు ఇస్తానన్నాడు. ఫలితంగా నేను అతనికి చెయ్యాల్సిన హెల్ప్ ఒక్కటే. అతడు కొన్న స్టాకుని జాగ్రత్తగా చూడడం ఆ స్టాకు పెట్టుకోడానికి కావలసిన గోడౌను, దాని రెంటు అన్నీ అతనే భరిస్తాడు అదీ విషయం" అన్నాడు రమణ.

"దానివల్ల అతని కొచ్చేలాభం?"

నన్ను పూర్తిగా చెప్పనీ. నీకు తెలుసుగా ఇండియాలో తయారైన షూస్‌కి ఫారిన్‌లో ఎంత మార్కెట్ ఉందో... అలా కామేశ్వరరావు తిరిగి ఓసారి ఇండియాకి వచ్చి కొన్నివేలు షూస్ కొని, దాన్ని తనకు కావలసిన పద్ధతిలో ప్యాక్ చేయించి, అవన్నీ నేను ఉండే గోడౌన్‌లో స్టాక్ చేయించి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కొన్నాళ్ళకి అతను పంపించిన మనిషి వచ్చి సగం స్టాక్ తీసుకొని వెళ్ళాడు. మరో నాలుగైదు నెలల తర్వాత కామేశ్వరరావు పంపించిన మనిషి ఇంకొకతను వచ్చి బాలెన్స్ స్టాక్ తీసుకొని వెళ్ళిపోయాడు. అంతే... అదే నేను అతనికి చేసిన హెల్ప్" అన్నాడు రమణ.

"ఏమిటీ నాకేమీ అర్థం కావడంలేదు. కేవలం అతని స్టాక్‌కి కావలసిన కాపలా ఉన్నందుకు నీకు పదివేలు ఇవ్వాడంటే ఆశ్చర్యంగా ఉంది" అన్నాను

"అదే అసలు సీక్రెట్. కామేశ్వరరావు ఏం చేశాడో తెలుసా? ఒక మనిషికి రానుపోను ఛార్జిలిచ్చి పంపించాడు.

ఆ మనిషి ఈ షూస్‌ని తీసుకొని వెళ్ళాడు. లండన్ ఎయిర్ పోర్ట్‌లో కస్టమ్స్ వాళ్ళు పట్టుకొన్నారు. డ్యూటీ కట్టనందుకు సరుకు స్వాధీనం చేసుకున్నారు. 'నేను కట్టలేను నా వల్లకాదు' అన్నాడా మనిషి. సో... స్వాధీనం చేసుకున్న సరుకు తర్వాత వేలం వెయ్యక తప్పలేదు ఆ కస్టమ్స్ వాళ్ళకి. ఆ వేలం పాటలో తన సరుకుని తనే పాడుకుని

●●●

**పొజిషన్ బట్టి మారేది నిజమైన స్నేహం కాదు కదా!**

●●●

# సరదాకథలు

కొనుక్కున్నాడు కామేశ్వరరావు. అలా 'త్రోఏవే ప్రైస్'కి సరుకుని సంపాదించుకున్నాడతను. ఆ షూస్‌ని అమ్ముకొని చాలా లాభం గడించాడు''.

''నాకింకా కన్‌ఫ్యూజింగ్‌గానే ఉంది. కామేశ్వరరావు పంపించిన వ్యక్తి డ్యూటీ ఎందుకు కట్టలేదు ?'' అంటూ అడిగాను.

''అది మూడింతలు ఉంటుంది కనుక. అందుకే కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు వేలం పాటలో త్రోఏవే ప్రైస్‌కి డిస్పోజ్ చేసే వరకు ఆగాడు''.

''లండన్‌లో మన ఇండియన్ షూస్‌కి మంచి గిరాకీ ఉన్నప్పుడు త్రోఏవే ప్రైస్‌కి ఎందుకు కస్టమ్స్ వాళ్ళు డిస్పోజ్ చెయ్యాలి?''

''గుడ్...ఇదీ కరెక్టు ప్రశ్న. కామేశ్వరరావు తెలివితేటల్ని బైట పెట్టే ప్రశ్న కూడా ఇదే.

అసలు కామేశ్వరరావు ఏం చేశాడో తెలుసా... ఇండియాలో సరుకుకొన్నప్పుడే వాటిని తిరిగి తనకు కావలసిన పద్ధతిలో ప్యాక్ చేయించాడు.

అంటే కుడికాలి షూస్ అన్నీ ఒక కన్‌సైన్‌మెంట్‌లో, ఎడం కాలి షూస్ అన్నీ ఇంకో కన్‌సైన్‌మెంట్‌లో వచ్చేట్టుగా చూసుకున్నాడు.

మొదటి సారి వచ్చినతను ఒక కన్‌సైన్‌మెంట్ పట్టుకెళ్ళాడు. కస్టమ్స్ వాళ్ళు స్వాధీనం చేసుకొన్న తర్వాత విప్పి చూసుకుంటే ఏముంది అన్నీ కుడికాలి షూసే... ఎవడు కొంటాడు అలా? అంచేత త్రోఏవే ప్రైస్‌కి తోసేశారు.


ఆవేడి చల్లారిన మరో ఆరునెలల తర్వాత కామేశ్వరరావు ఇంకో మనిషిని పంపించి ఎడం కాలి షూస్ తెప్పించుకున్నాడు.

అవి కూడా అలాగే త్రోఏవే ప్రైస్‌కే తోసేశారు కస్టమ్స్ వాళ్ళు. దాన్నీ కామేశ్వరరావే మరో వ్యక్తి ద్వారా కొనిపించి తన స్వాధీనంలోకి తెచ్చుకొని తర్వాత రెండు కన్‌సైన్‌మెంట్‌లవీ కలుపుకొని చక్కగా అమ్మి మంచి లాభం గడించాడు. అదీ సంగతి'' అన్నాడు రమణ.

''ఇదంతా గిట్టుబాటయిందా కామేశ్వరరావుకి ?''

''ఎందుక్కాదు? కస్టమ్స్ డ్యూటీ మూడింతలు ఉండటమే దానిక్కారణం. ఇక్కడ అయిదు వందలకి కొన్న షూ అక్కడ రెండువేల రూపాయలుంటుంది. ఈ మూడింతలు రేటు బదులు నాకు ఇక్కడ గోడౌన్ ఛార్జెస్, నా ఛార్జెస్, ఇద్దరు వ్యక్తుల రానుపోను ఛార్జీలు అన్నీ అతనికి అతి చౌకలో వర్క్ అవుట్ అయింది.

మామూలుగా రెండువేలు రూపాయలకి వచ్చే సరుకు ఒక పదిహేనువందలకే వచ్చిందనుకో దెబ్బతో జనం విరగబడి కొంటారు. కానీ కామేశ్వరరావుకి అయిన ఖర్చు వెయ్యి రూపాయలే. వెయ్యిరూపాయల ఖర్చుకి పదిహేను వందలు వచ్చిందంటే ఫిఫ్టీ పర్సెంట్ ప్రాఫిట్ కాదూ.... ? అందుకే కామేశ్వరరావు నాకు నా ఫైన్ రియంబర్స్‌మెంట్ బిజినెస్‌కి ఇన్‌స్పిరేషన్ అయ్యాడు'' అని ముగించాడు రమణ.




# ఆదాయపు పన్ను బకాయిలు



ఆదాయపు పన్ను శాఖవారు అందించిన సమాచారం ప్రకారం ఫిల్మ్ జగత్తులోని54 మంది ఆదాయపు పన్ను బకాయిల లిస్టులో వున్నారట. వారిలో చనిపోయిన రాజ్‌కపూర్, అంజద్‌ఖాన్‌లతోపాటు యన్.టి. రామారావు, బాలకృష్ణ, విశ్వజిత్, రాజేష్‌ఖన్నా, శత్రుఘ్నసిన్హా, జయప్రద, కమల్‌హాసన్, రేఖ, డింపుల్ కపాడియా, శ్రీదేవి, రజనీకాంత్, శివాజి గణేశన్, షబానా అజ్మి, భాగ్యరాజా మొదలగువారున్నారట.